


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 222 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 21 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 222 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 21 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

- ఉండవల్లిలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుపై రాందేవ్ ప్రశంసలు
- చంద్రబాబును యోగి, కర్మ యోగిగా అభివర్ణించిన యోగా గురువు
- ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని కితాబు
- ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారిందన్న రాందేవ్
- చంద్రబాబులాగే ప్రతీ ముఖ్యమంత్రి పనిచేస్తే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- విశాఖలోని ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను సందర్శించిన పల్లా
- ఆరోగ్య రంగంలో సంస్థ సేవలు ఆదర్శనీయమని ప్రశంస
- ప్రోటిజెనిక్స్ స్ఫూర్తితో స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు
- సంస్థకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ

భారత ఆరోగ్య రంగ స్వావలంబనలో ప్రోటిజెనిక్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రశంసించారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు ప్రోటిజెనిక్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం విశాఖలోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను ఆయన సందర్శించి, యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అత్యవసరమైన ప్లాస్మా ఆధారిత ఔషధాల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రోటిజెనిక్స్ చేస్తున్న కృషి అభినందనీయం. ఆరోగ్య రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఇలాంటి సంస్థలే కీలకం" అని పేర్కొన్నారు. ప్లాస్మా ప్రోటీన్ థెరప్యూటిక్స్‌పై దృష్టి సారించిన

- మిగతా 2లో



## ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

- ఉండవల్లి గుహల వద్ద 'యోగాంధ్ర' కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, యోగా గురు రాందేవ్
- చంద్రబాబును కర్మయోగి అంటూ కొనియాడిన రాందేవ్
- మోదీ లక్ష్యాలకు సీఎం సహకారం అద్భుతమన్న యోగా గురు
- ఆసక్తిగా యోగాసనాలను తిలకించిన ముఖ్యమంత్రి

- మిగతా 2లో

# రైతులకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం

## అన్నదాత సుఖీభవ: రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు

- చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్లలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు విడుదల
- తొలి విడతగా ఒక్కో రైతుకు రూ.7 వేల చొప్పున ఆర్థిక సాయం
- కడప, కర్నూలులో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన
- వ్యవసాయ స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్ల వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లను జమ చేశారు. ఈ సాయంతో ప్రతి రైతు ఖాతాలో తొలి విడతగా రూ.7,000 జమ అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, అంతకుముందు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. రైతులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లు, వర్మీ కంపోస్టు తయారీ, నూనె గింజల మిషన్ వంటి ప్రదర్శనల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎం కిసాన్ పథకంపై ప్రధాని మోదీ ప్రసంగించిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి సీఎం వీక్షించారు. ఇదే వేదిక నుంచి ముఖ్యమంత్రి 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కడప, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్లు 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.



## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

- అర్ధాంగి భువనేశ్వరికి సీఎం చంద్రబాబు భావోద్వేగ బర్త్‌డే విషెస్
- భార్య, తల్లి, వ్యాపారవేత్తగా ఆమె మా జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడిన సీఎం
- భువనేశ్వరి దయ, కరుణ ఎందరికో ఆదర్శమని ప్రశంస
- నీలాంటి వ్యక్తి జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టమంటూ పోస్ట్

- మిగతా 2లో

## హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం - ఇరాన్



అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు

- మిగతా 2లో



## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని

- మిగతా 2లో

## రూ.10 లక్షల కోట్ల అప్పు..

### విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

- ఆర్థికవేత్తలు, నిపుణులతో సంప్రదింపుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు దాటాయని శ్వేతపత్రంలో వెల్లడి
- 2031 నాటికి పని చేసే వయసు జనాభా తగ్గనుందని, ఇప్పుడే చర్యలు తీసుకోవాలని హెచ్చరిక

- మిగతా 2లో



## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

- కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ముద్రగడ
- ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత
- రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చామన్న కుటుంబ సభ్యులు

- మిగతా 2లో



## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!



- ఇరాన్‌తో ఒప్పందం విషయంలో గందరగోళం
- అమెరికా తరహాలో పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదన్న వాన్స్
- అందుకే ఒప్పంద వివరాలు త్వరగా వెల్లడి కాలేదని వ్యాఖ్య
- ఒప్పందం కుదర్చడం తమ ఘనతగా చెప్పుకొంటున్న పాక్
- వాన్స్ వ్యాఖ్యలతో పాక్‌కు ఇబ్బందికర పరిస్థితి

- మిగతా 2లో

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను

- మిగతా 2లో



## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## జగన్ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? ఈ ప్రచారంలో నిజమెంత?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కాంగ్రెస్ తో జత కడుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మీడియా సమావేశంలో ఆయన చేసిన కాక్రోచ్ వ్యాఖ్యలతో ఆయన కాంగ్రెస్ కు మరింత చేరువయ్యారని, బీజేపీకి దూరమవుతున్నారన్న కక్యాంపెయిన్ సోషల్ మీడియాలో నడుస్తుంది. అంతకు ముందు నుంచే ఈ ప్రచారం జరుగుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని సోషల్ మీడియాలో హోరెత్తిపోతుంది. బెంగళూరులో తన నివాసంలో ఉంటున్న జగన్ డీకే శివకుమార్ తో భేటీ అయ్యారన్న వార్తలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**కర్ణాటక నుంచి...**

బీజేపీ పై దేశ వ్యాప్తంగా ఎదురవుతున్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని, అందుకే కర్ణాటక నుంచి వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కకుండా చేయడం వెనక కూడా జగన్ ఉన్నారంటూ మరొక ప్రచారం కూడా జరిగింది. తాజాగా ఏపీలో తాము కాక్రోచ్ లుగా మారుతామని జగన్ చేసిన వ్యాఖ్యలను తీసుకుని ఆయనను హస్తం పార్టీకి దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందులో నిజానిజాలు పరిశీలిస్తే... జగన్ కాంగ్రెస్ తో జత కట్టడానికి అసలు ఇష్టపడరు. ఎందుకంటే 2012లో పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. అప్పటి నుంచి జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వస్తున్నారు. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ తో కలవకుండానే ఎన్నికల్లో పోటీ చేస్తూ తన పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంకును సంపాదించుకున్నారు.

**ఏపీ రాజకీయాలకే...**

జగన్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకే పరిమితమవుతారు. ఆయన తెలంగాణ వైపు కూడా చూడరు. అలాంటింది రాష్ట్ర విభజనకు కారణమయిన కాంగ్రెస్ తో ఎందుకు జట్టు కడతారు? అన్న ప్రశ్నకు ప్రచారం చేసే వారి నుంచి సమాధానం ఉండదు. అందులోనూ వైసీపీ ఓటు బ్యాంకు అంతా కాంగ్రెస్ నుంచి వచ్చిందే. మళ్లీ కాంగ్రెస్ తో కలిస్తే తాను రెండు దశాబ్దాలుగా ఏర్పరచుకున్న ఓటు బ్యాంకును తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపే చేసే చర్యలకు అస్సలు దిగరన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. బీజేపీ ఇప్పుడు కేంద్రంలో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తుంది. జగన్ బీజేపీకి రహస్య మిత్రుడు. బలమైన బీజేపీని కాదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేంత రాంగ్ స్టెప్ ను రాజకీయంగా జగన్ వేయరన్నది కూడా అంతే వాస్తవం. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లోనూ ఒంటిరిగానే పోటీ చేస్తారు. ఒకవేళ ఎన్నికల అనంతరం పొత్తు ఇవ్వాల్సి వస్తే బీజేపీతో చేతులు కలుపుతారు కాని, తనను పద్నాలుగు నెలల పాటు జైల్లో ఉంచిన కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వరన్నది వాస్తవం.

## చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక యోగి, కర్మ యోగి అని, ఆయనలా దేశంలోని ప్రతి ముఖ్యమంత్రి పనిచేస్తే 'వికసిత్ భారత్' లక్ష్యం 2047 కంటే ముందే సాకారం అవుతుందని యోగా గురువు బాబా రాందేవ్ ప్రశంసించారు. శనివారం ఉండవల్లిలోని ప్రజావేదిక వద్ద 'యోగాంధ్ర' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు సైతం ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, రాందేవ్ బాబా నిర్వహించిన యోగసాధనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. "సీఎం చంద్రబాబు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు, కానీ నేను యోగా అతిథిగా వచ్చాను. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, చురుకుగా ఉండటం స్ఫూర్తిదాయకం. చంద్రబాబు అభివృద్ధి, దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్', 'ఏక్ భారత్-శ్రేష్ట్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి చంద్రబాబు తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంపై కూడా రాందేవ్ బాబా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారింది. ఈ రాజధానిని పచ్చదనంతో, అద్భుతమైన అందాలతో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం స్విట్జర్లాండ్‌ను తలపిస్తోంది" అని కితాబిచ్చారు. అంతకుముందు ఉండవల్లి గుహల్లో కొలువైన పద్మనాభ స్వామిని దర్శించుకున్నానని, ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగా ప్రేమికుడు, సర్వజన ప్రేమికుడు అని అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో రాందేవ్ బాబా తన శిష్యులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!

అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇస్లామాబాద్‌ను ఇరకాటంలోకి నెట్టాయి. ఒప్పంద వివరాల విడుదల ఆలస్యంపై స్పందించిన ఆయన పాకిస్థాన్‌లో అమెరికా తరహా పత్రికా స్వేచ్ఛ లేదని వ్యాఖ్యానించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన వాన్స్ అమెరికాలో ఒప్పందాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనే అంచనాలు ఉంటాయని చెప్పారు. కానీ పాకిస్థాన్, ఖతార్ వ్యవస్థల్లో అలాంటి సంప్రదాయం లేదని వ్యాఖ్యానించారు. అందుకే ఇరాన్‌తో ఒప్పంద వివరాలు విడుదల చేసే విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో పాకిస్థాన్ 180 దేశాల్లో 153వ స్థానంలో ఉంది. అక్కడ జర్నలిస్టుల స్వేచ్ఛపై అంతర్జాతీయ సంస్థలు గతంలోనూ ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని తమ దౌత్య విజయంగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సంతకాల కార్యక్రమం రద్దు కావడం కూడా పాకిస్థాన్‌కు ఇబ్బందిగా మారింది. చివరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ డిజిటల్ పద్ధతిలో ఒప్పందంపై సంతకాలు చేశారు.

## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- **మొదటి** పేజి తరువాయి

ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు.

గత కొన్ని రోజులుగా ముద్రగడ పద్మనాభం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య సమస్యలు కాస్త ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గత రెండు రోజులుగా వైద్యులు ఆయనకు డయాలసిస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చికిత్స అందిస్తున్న డాక్టర్ల టీమ్ అధికారికంగా వెల్లడించింది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్... ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా ఆరా తీశారు. ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన జగన్... ఆయన అత్యంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, ముద్రగడ ఆసుపత్రిలో చేరారనే వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షురూ అయ్యాయి. దీంతో ఆయన ఆరోగ్యంపై కాపు శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ముద్రగడ కుటుంబ సభ్యులు వెంటనే స్పందిస్తూ ఆందోళనలకు చెక్ పెట్టారు. "ఆయన క్షేమంగా ఉన్నారు. కేవలం రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చాం. దయచేసి ఇంటర్నెట్‌లో వచ్చే ఎలాంటి అవాస్తవాలను, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు

హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- **మొదటి** పేజి తరువాయి

ఏపీలోని తొలి సంస్థ ఇదేనని ఆయన గుర్తుచేశారు. 2021లో ఎన్నారై వైద్యుల బృందం స్థాపించిన ఈ సంస్థ.. ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబులిన్ (×ఎ×+), హ్యూమన్ అల్బుమిన్, ఫ్యాక్టర్ ఎ××× వంటి కీలక ఉత్పత్తులను అభివృద్ధి చేస్తోంది. రోగనిరోధక లోపాలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రక్తస్రావ సమస్యల చికిత్సలో ఈ ఔషధాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రోటిజెనిక్స్ సంస్థను ఆదర్శంగా తీసుకుని ఎన్నారైలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పల్లా కోరారు. విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, ప్రజల ఆరోగ్య భద్రతకు తోడ్పడే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## రూ.10 లక్షల కోట్ల అప్పు.. విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

తమిళనాడు రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'వుయ్ ది లీడర్' వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ. 13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక 'పోస్ట్‌మార్టమ్' లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- **మొదటి** పేజి తరువాయి

నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎిఎఇఖిఅ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

## హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

- **మొదటి** పేజి తరువాయి

చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (×=+జ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు

తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

## ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

యోగా గురు బాబా రాందేవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు ఒక కర్మయోగి అని అభివర్ణించారు. అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద శనివారం 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాందేవ్ యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలైన 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు అందిస్తున్న సహకారం అమోఘమని కితాబిచ్చారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. అంతకుముందు పతంజలి యోగా గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో యోగాకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, యోగా అభిమానులు పాల్గొన్నారు.

## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అర్ధాంగి నారా భువనేశ్వరికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. భువనేశ్వరిని తన జీవితంలో వెలుగుగా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు.

"భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా మా అందరి జీవితాల్లో వెలుగు నింపే భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "నీ దయ, కరుణ, సానుకూల దృక్పథం ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. నీ ఔదార్యంతో ఇతరులను ఉన్నత స్థానంలో నిలబెడతావు. నువ్వు చేపట్టే ప్రతి పాత్రకు అందాన్ని, ప్రయోజనాన్ని చేకూరుస్తావు" అని కొనియాడారు. "నీలాంటి అద్భుతమైన వ్యక్తి నా జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టం. నీ బలం, ఆప్యాయత, మరెన్నో విధాలుగా నువ్వు ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి -ఎస్ఐ లతాశ్రీ





**చింతూరు, పెన్ పవర్, జూన్ 20:** బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని చింతూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీ పిలుపునిచ్చారు. మండలంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరపాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, మొబైల్ ఫోన్ల ద్వారా మహిళలను ట్రాప్ చేసే ఘటనల గురించి వివరించారు. ఎవరైనా మహిళలను వేధిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అవసరమైతే 112 నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందాలని సూచించారు. మైనర్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వాట్సాప్ కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేసే మోసగాళ్లను నమ్మవద్దని సూచించారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే మైనర్ బాలురు, బాలికలు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. సీడీపీఓ పి. జయలక్ష్మి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు ఆవేశపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని మహిళలకు సూచించారు. ఆత్మహత్యల వల్ల కుటుంబ సభ్యులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వెలుగు ఏపీఎం సుధాకర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళలు విద్యావంతులు కావాలని, మహిళల విద్యాభివృద్ధి ద్వారా కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సీసీలు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.




# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2026 ను విజయవంతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి





జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 20:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జులై 1వ తేదీ లోగా జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ భాస్కర్ రెడ్డి లు రాజకీయా పార్టీల ప్రతినిధులు చేసిన పలు సందేశాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ,

ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ఖచ్చితమైనదిగా, పారదర్శకమైనదిగా రూపొందించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు లేదా నకిలీ నమోదులను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. రాజకీయ పార్టీలు చేసిన సూచనలను తప్పకుండా పరిగణన లోనికి తీసుకుని వెళ్ళడం జరుగుతుందనీ అని తెలిపారు. ఇప్పటికే మ్యాపింగ్ అయిన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారం లు ఇవ్వవలసి ఉందా అనే విషయంలో తప్పకుండా పూరించి ఇవ్వవలసి ఉందని స్పష్టం చేశారు. ఇంటింటికీ వెళ్లి బూత్ స్థాయి అధికారులు గణన ఫారాలను పంపిణీ చేస్తున్నారని, నోటీసు అందుకున్న ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫామ్ ను పూర్తిగా పూరించి, అవసరమైన ఆధార పత్రాలతో పాటు నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓకు తప్పనిసరిగా అందజేయాలని కోరారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు మ్యాపింగ్ అయిన ఓటర్లు కూడా తప్పనిసరిగా గణన ఫారం సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓటరు పేరు, చిరునామా, కుటుంబ వివరాలు తదితర అంశాలు సక్రమంగా నమోదు కావడానికి ప్రజల సహకారం అత్యంత కీలకమన్నారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాన్ని లేదా తమ బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో రాజకీయ పార్టీ ఏజెంట్స్ పాత్ర కీలకం అని తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏల పాత్రలను జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ వివరించారు. బీఎల్ఓలు ఎన్నికల సంఘం నియమించిన ప్రభుత్వ అధికారులు కాగా, ఓటరు జాబితా నిరంతర నవీకరణ, ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, ప్రత్యేక సవరణ కార్యక్రమాల నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. బీఎల్ఏలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు నియమించే ప్రతినిధులని, ఓటరు జాబితా పరిశీలన, అర్హులైన ఓటర్ల నమోదుకు సహకారం, అభ్యంతరాల సమర్పణ, ఎన్నికల అధికారులతో సమన్వయం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేసి వివరాలు అందజేయాలని కోరారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరిస్తూ, జూన్ 5 నుంచి 14 వరకు శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. జూలై 14 నాటికి పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం, జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం, తదుపరి జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ, సెప్టెంబర్ 18 నాటికి వాటి పరిష్కారం పూర్తి చేసి, సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లకు మించకుండా చర్యలు తీసుకుంటూ, హై రైజ్ అపార్ట్‌మెంట్లు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీలు, స్లమ్ క్లస్టర్లలో అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వీలైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటర్ల చిరునామాల సవరణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న 1,807 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 240 కొత్త కేంద్రాలు, 49 కేంద్రాల స్థల మార్పు, 30 కేంద్రాల నామకరణ మార్పు, 7 కేంద్రాల విలీనం లేదా తొలగింపు, 8 కేంద్రాల్లో సెక్షన్ల మధ్య ఓటర్ల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు ఎన్నికల సంఘం ఆమోదానికి పంపినట్లు తెలిపారు. ఆమోదం అనంతరం జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 2,048కు చేరుతుందని వెల్లడించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు 2002 నాటి ఓటరు జాబితా అందించాలని విజ్ఞప్తి చేశారు. అప్పటి నుంచి పోలింగ్ కేంద్రాల సంఖ్యలు మారడం, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రజల వలసలు, పాత డోర్ నంబర్ల మార్పులు వంటి కారణాల వల్ల క్షేత్రస్థాయిలో గుర్తింపు సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పాత చిరునామా నుంచి పేరు తొలగించి కొత్త చిరునామాలో నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించినప్పటికీ, పాత ప్రాంతంలో ధృవీకరణ పూర్తయిన తర్వాతే తొలగింపు ప్రక్రియ చేపడతామని బీఎల్ఓలు చెబుతున్నట్లు సమావేశంలో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఎస్. భాస్కర్ రెడ్డి, ఎం.ఆర్.ఆర్. ప్రేమ్ కుమార్, కె. భాగ్యలక్ష్మీ, సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, టీడీపీ తరపున మత్సెట్టి సత్య ప్రసాద్, కాంగ్రెస్ తరపున పట్నాల శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ తరపున వి.ఎం. కుమార్, వైఎస్సార్‌సీపీ తరపున టి. దేవదానం, సీపీఐ(ఎం) తరపున టీ. వరుణ్, బి. మురళీధర్, పీకే విశ్వేశ్వర్ రెడ్డి, బి. పవన్, బీబీఎన్ పూర్ణిమ రాజు, బీఎస్పీ తరపున కె. సుధాకర్, బీజేపీ తరపున కె. సత్య సాయిరాం, కె.వి. రమేష్, కె. ప్రకాష్, ఏ. కుమార్ బాబు, ఆప్ తరపున వై. శ్రీనివాస్ రావు తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతన్నలను దగా చేసిన ఘనత గొడ్డలి పార్టీదే





-దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

**ఏలూరు జూన్ 20 పెన్ పవర్:** రైతన్నలకు అన్ని విధాలా అండగా నిలిచిన రైతు పక్షపాతి ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదే నాని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,దెందులూరు నియోజకవర్గంలో 21,114 మంది రైతన్నల ఖాతాల్లో రూ.13.80 కోట్ల నిధులు విడుదల చేసామన్నారు.దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' రెండవ ఏడాది తొలి విడత కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల మోసాల నుండి అన్నదాతలను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమే అన్నారు.అధికారులు, కూటమి నాయకులతో కలిసి సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూరాష్ట్రంలోని అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తూ, వ్యవసాయాన్ని పండుగలా మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం రెండవ ఏడాది తొలి విడత నిధుల పంపిణీ కార్యక్రమం శనివారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారి అధ్యక్షతన అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దెందులూరు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న 21,114 మంది రైతన్నల బ్యాంకు ఖాతాల్లోకి ఒకేసారి రూ.13 కోట్ల 80 లక్షలు పెట్టుబడి సహాయాన్ని నేరుగా అకౌంట్లకు జమ చేయడం జరిగింది అన్నారు ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది స్థానిక కూటమి నాయకులు,

రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

గుంటూరు జిల్లా వేదికగా రాష్ట్రస్థాయిలో జరుగుతున్న అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ నిధుల విడుదల సభకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాన్ని,గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన దిశా నిర్దేశక ప్రసంగాన్ని నియోజకవర్గ అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు, రైతు సోదరులతో కలిసి ఎమ్మెల్యే,మండల కార్యాలయ.లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ డిజిటల్ స్క్రీన్‌పై వీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గత గొడ్డలి పార్టీ ప్రభుత్వఅనాలోచిత విధానాలు, మోసాల వల్ల రాష్ట్రంలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, అప్పుల ఊబిలో కూరుకుపోయిందని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటూ, గత గొడ్డలి పార్టీ ఎగ్గొట్టిన ధాన్యం బకాయిలు చెల్లించడమే కాకుండా, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే రైతులకు దాన్యం సొమ్ములు వారి అకౌంట్లో జమ అయ్యేలా చేసి కోడం ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకుందని అన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ద్వారా సకాలంలో పెట్టుబడి సహాయాన్ని నేరుగా అందిస్తోందన్నారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్రాలను చేరువ చేస్తూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. భారతదేశంలోనే రైతన్నల సంక్షేమానికి ఇంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమేనని ఆయన కొనియాడారు.

ఈ కార్యక్రమంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గారపాటి రామసీత, నియోజకవర్గ పరిశీలకురాలు ఇందిరా ప్రియదర్శిని, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బొప్పన సుధ, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకురాలు అనిలా కుమారీ, సహకార సొసైటీల చైర్మన్లు తాతా సత్యనారాయణ, గారపాటి కొండయ్య చౌదరి,వెలమాటి అనిల్, మోటిపల్లి పవన్, కూచిపూడి కిషోర్, కొనకళ్ళ శివమణి గౌడ్, డాక్టర్ పసుమర్తి మధు, గారపాటి స్టాలిన్, కాలారి శ్రీనాథ్ చౌదరి, ఎలమర్తి వీర వెంకట సత్యనారాయణ,పూజారి వెంకటరత్నం నాయుడు, బొడ్డేటి మోహన్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ యాదవ్, మండల పార్టీల అధ్యక్షులు ఈడుపుగంటి అనిలు, మరడాని రవి, నంబూరి నాగరాజు, నాగన్న బోయిన సత్యనారాయణ, ఎమ్మార్వోలు బత్తిన సుమతి, కృష్ణ జ్యోతి, ఎంపీడీవో ప్రతాప్, కూటమి నాయకులు మోత్కూరి నాని, మంచినేని శ్రీనివాస్, గుత్తా అనిల్, పరస వెంకట్రావు, గుడిపూడి రేవతి, వడ్డీ వాసవి దేవి, జనసేన కల్కి ఇప్పిలి వెంకటేశ్వరరావు, కమ్మ శివరామకృష్ణ,రాంప్రసాద్, వేగుంట సురేష్, కసుకుర్తి రామకృష్ణ, పలువురు సొసైటీల చైర్మన్లు, క్లస్టర్ ఇంచార్జిలు, వివిధ శాఖల అధికారులుతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు..

ఈ సందర్భంగా రైతన్నలకు అన్ని విధాల అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి, దెందులూరు ఎమ్మెల్యే రైతన్నలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు..

# విద్యార్థులు సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టాలి








జాతీయ జల మిషన్ డైరెక్టర్ అశోక్ బాబు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 20:**.విద్యార్థులు సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టి దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని డైరెక్టర్ అండ్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్, నేషనల్ వాటర్ మిషన్ మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎన్.అశోక్ బాబు (ఐఆర్ఎస్) సూచించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆచార్యులు, పరిశోధక విద్యార్థులతో శనివారం పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ బాబు మాట్లాడుతూ జల వనరుల సంరక్షణ, సుస్థిర అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించటంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. జల శక్తి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం అశోక్ బాబు కెమికల్ ప్రయోగశాలను సందర్శించి కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వినోత్ కుమార్ రాజా ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మల్టీచానల్ ట్యూబ్యులర్ సిరామిక్ మెంబ్రేన్ ను పరిశీలించారు. ఈ మెంబ్రేన్‌ను స్వదేశీ, తక్కువ వ్యయంతో లభించే ముడి పదార్థాలను ఉపయోగించి తయారు చేశామని, వివిధ రకాల మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాల శుద్ధికి ఈ మెంబ్రేన్ సమర్థవంతంగా ఉపయోగపడుతుందని ఆచార్యులు వినోత్ కుమార్ రాజా, అశోక్ బాబుకు వివరించారు. ఈ సాంకేతికతకు సంబంధించిన ప్రాజెక్టు ద్వారా జల్ శక్తి హ్యాకథాన్ అవార్డును, రూ. 1 లక్ష నగదు బహుమతిని కూడా అందుకున్నామని చెప్పారు. తక్కువ ఖర్చుతో నీటి శుద్ధి, నీటి పునర్వినియోగం, జల వనరుల సంరక్షణకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆచార్యులు వినోద్ కుమార్ రాజు ఆయనకు తెలియజేశారు. ఏపీ నిట్ డీన్ లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్ ముఖ్యవక్త అశోక్ బాబును సాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ శ్రీ ఫణి కృష్ణ కర్రీ, డాక్టర్ అల్లంశెట్టి శ్రీకాంత్, డాక్టర్ తపస్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ చేబ్రోలు శ్రీలత, డాక్టర్ శీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛభారత్'కార్యక్రమం..






**అడ్డతిగల, పెన్ పవర్, జూన్20:**స్థానిక అడ్డతిగల సామాజిక ఆరోగ్య కేంద్రం లో శనివారం 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కికోఆర్డినేటర్ గా వ్యవహరించిన హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ రెడ్డి పర్యవేక్షణలో ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.?ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ, పరిశుభ్రత అనేది కేవలం ఒక రోజుతో ముగిసేది కాదని, ప్రతి ఒక్కరూ ప్రతి నిత్యజీవితంలో భాగం చేసుకోవాలనిపిలుపునిచ్చారు. హాస్పిటల్ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం ద్వారా రోగులకు మరింత ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే అధికారులు ప్రభుత్వ ఆదేశాలు ఎప్పటికప్పుడు అందరం కలసి పాటిస్తూ పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ రేష్మ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా, నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని అవగాహన కల్పించారు.?స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ నారే.వాసు అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందికి, ప్రజలకు చెత్త శుభ్రత, తడి-పొడి చెత్త వర్గీకరణ మరియు ప్లాస్టిక్ నివారణ గురించి క్షుణ్ణంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం, పారామెడికల్ స్టాఫ్, ల్యాబ్ , ఫార్మసీ , ఆరోగ్య శ్రీ , జీడిఏ , శానిటేషన్, సెక్యూరిటీ, అడ్మినస్ట్రేషన్ సిబ్బంది,రోగులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




- ప్లాస్టిక్ నిర్మూలనతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం సాధ్యం
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20** : పోలవరం జిల్లాలోని ప్రతి గ్రామంలో పరిశుభ్రమైన పరిసరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారం నిర్వహించిన ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం శనివారం రంపచోడవరం అంబేద్కర్ సెంటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి, జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్, ఓఎస్డీ పంకజ్ కుమార్ మీనా, ఏఎస్పీ బి. హేమంత్ తదితరులు పాల్గొని ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరమన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేల, నీరు, జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణహిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ జిల్లాను పరిశుభ్రమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, ఆరుబయట మల విసర్జనకు పూర్తిగా స్వస్తి పలికి మరుగుదొడ్లను వినియోగించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని విచక్షణారహితంగా పారవేయకుండా గ్రామాల పరిశుభ్రతకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు తమ సొంత కార్యక్రమంగా భావించి భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రతను కాపాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్‌ను అందించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డీఎస్వీ రమణ, డీడీఓ వెంకటనారాయణ, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, పీహెచ్ఓ దేవాదానం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్‌రావు, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



**ఏలూరు జూన్ 20 పెన్ పవర్ :** దెందులూరు నియోజకవర్గం లో పలు గ్రామపంచాయతీలలో శనివారం జరిగిన 'స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో పాల్గొని స్వయంగా రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు చెల్లాచెదురుగా పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను చేతులతో ఏరివేసి పారిశుధ్య కార్మికుల్లో, ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందమైన పల్లెలే అభివృద్ధికి సోపానాలు.. నియోజకవర్గంలో ప్లాస్టిక్ రహిత పారిశుధ్య విప్లవం సాధిచాలన్నారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దెందులూరు జాతీయ రహదారి, మల్కాపురం గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేసే కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. గ్రామాల్లో బహిరంగ చెత్త వేయడంపై నిషేధమని,ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. పరిశుభ్రమైన వాతావరణంకోసం, ప్లాస్టిక్ రహిత పల్లెలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాదులని, అందమైన పల్లెలను నిర్మించుకోవడం ద్వారానే అభివృద్ధికి నిజమైన మార్గదర్శకులుగా నిలపగలమని అన్నారు . అనంతరం ఏలూరు రూరల్ మండలం మల్కాపురం గ్రామం వద్ద నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో గ్రామంలో కాలువల వద్ద, రహదారుల ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లను తొలగించారు. ప్రజలంతా బాధ్యతగా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో దెందులూరు సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, మాజీ సర్పంచ్ తోట ఏసమ్మ, మండల పార్టీల అధ్యక్షులు నాగనబోయిన సత్యనారాయణ, ఈడుపుగంటి అనిల్, కూటమి నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు కమ్మ శివరామకృష్ణ, నేతల రవి, తిలక్, వెలమాటి రాంబాబు, దెందులూరు ఎమ్మార్వో బత్తిన సుమతి, దెందులూరు ఎంపీడీవో ప్రతాప్, సహా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ 45 నిమిషాల యోగతో ఆరోగ్యవంతమైన జీవనం



యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20** : ప్రతి వ్యక్తి ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల పాటు యోగా చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి, జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా భారతదేశానికి చెందిన అమూల్యమైన వారసత్వ సంపద అని, 2014లో ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి గుర్తింపు లభించడంతో ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాచుర్యం పొందిందన్నారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా యోగా ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. పోలవరం జిల్లా పర్యాటక అవకాశాలతో కూడిన ప్రాంతమని, రంపచోడవరం, మారేడుమిల్లి, గుడిసె వంటి ప్రాంతాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పేందుకు యోగాంధ్ర కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. ఈ నెల 21న రంపచోడవరం ఏపీఆర్‌జేసీ బాలుర పాఠశాల ప్రాంగణంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రజలు భారీగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ యోగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతుందని, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, జిల్లాలో యోగాపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువులు వివిధ ఆసనాలను ప్రదర్శించగా, గిరిజనుల కొమ్ము నృత్యాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మావోయిస్టుల చేతిలో మరణించిన ఏటపాక మండలం బండిరేవు గ్రామానికి చెందిన మడి రాజ్‌కుమార్ భార్య మడి రోజాకు పోలీసు శాఖ తరఫున రూ.51 వేల ఆర్థిక సహాయ చెక్కును జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూతి కుంటలో యోగాంధ్ర కార్యక్రమం





**వై రామవరం, పెన్ పవర్, జూన్ 20**: మండలంలోని చవిటి దిబ్బలు పంచాయతీ పూతి కుంట శివాలయం సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్ ఫాల్స్ ఉన్న చాపరాయి మీద శనివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహించడం జరిగిందని తెలిపారు. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన అందరితో యోగాసనాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతినిత్యం యోగాసనాలు వేయడం ద్వారా అనారోగ్యానికి దూరంగా ఉంటూ ఆరోగ్యంతో జీవించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ , జడ్పిటిసి, వై రామవరం ఎంపీటీసీ, స్వర్ణ గ్రామ సిబ్బంది, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు, మండల స్థాయి అధికారులు వైద్యాధికారులు, ఆయుష్ డాక్టర్,యోగాంధ్ర ట్రైనర్లు, పలుశాఖల ఉద్యోగులు పాల్గొన్నారని తెలిపారు.

## అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల



**వై రామవరం, పెన్ పవర్,జూన్ 20** : మండలానికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల అయ్యాయని వ్యవసాయాధికారిని సుజాత తెలిపారు.

అన్నదాత సుఖీభవ రెండవ సంవత్సరం మొదటి ఇన్స్టాల్మెంట్, పీఎం కిసాన్ యోజన 23వ ఇన్స్టాల్మెంట్ నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. ఉమ్మడి వై.రామవరం మండలంలో 5206 మంది లబ్ధిదారులు ఉండగా ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయలు చొప్పున2.60 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని తెలిపారు. అదే విధంగా పీఎం కిసాన్ యోజన 23వ విడతలో 5396 మంది లబ్ధిదారులకు 1.08 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని ఏవో తెలిపారు.

## తాళ్ళపూడిలో స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 20:**స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తాళ్లపూడి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రమైన వాతావరణం, పచ్చదనం పెంపు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తూ, స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, జనసేన పార్టీ ఇంచార్జ్ టి.వి.రామారావు, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి నామన పరమేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు సిద్దా దుర్గా ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ, కొఠారు వెంకట్రావు, వుడతా వీరేంద్ర, జడ్డు శ్రీను, కొప్పాక కోటీన్స్, కందుల నాగు, దూడల నాగు, అన్నమరెడ్డి రమణ, కోడి శంకరం, కూచిపూడి గణపతి, నామా నరేంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వలి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**ఏలూరు జూన్ 20 పెన్ పవర్ :** శనివారం దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందించడమే లక్ష్యమని, ఇందులో ఎలాంటి లోపాలు ఉన్నా సహించేది లేదని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న భోజన ఏర్పాట్లను, వంట సామాగ్రిని ఆయన స్వయంగా పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యాన్ని, ఎదుగుదలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌష్టికాహార పథకాలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా అమలు జరిగేలా సంబంధిత అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని, ఎప్పటికప్పుడు తాను ఇలాగే నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉంటానని స్పష్టంచేశారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారికి చాక్లెట్లు అందజేశారు. అనంతరం భారత గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినోత్సవాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులందరికీ ఆయన స్వయంగా కేక్ తినిపిస్తూ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండలం పార్టీ అధ్యక్షులు నాగనబోయిన సత్యనారాయణ, కార్యదర్శి కసుకుర్తి రామకృష్ణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, ఎమ్మార్వో బత్తిన సుమతి, ఎంపీడీవో ప్రతాప్, సహా పలువురు కూటమి నాయకులు, అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్లు, చైల్డ్ డెవలప్మెంట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు..

## వ్యసన విముక్తి పొందాక కుటుంబ సభ్యులతో ఆనంద మయ జీవితాన్ని గడపాలి -

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఈ స్వరాజ్య లక్ష్మీ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 20:** నషా ముక్త్ భారత్ సప్తాహ కార్యక్రమాలలో భాగం గా జూన్ 17 నుండి జూన్ 26 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఈ రోజు తాడేపల్లి గూడెం లోని దుర్గాదేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వారిచే నిర్వహించబడుతున్న దీక్ష డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ ను సందర్శించి అక్కడ సిబ్బంది తో సమావేశం నిర్వహించి తదుపరి వ్యసన విముక్తి కొరకు కేంద్రం లో చేరిన వారికి మత్తు పదార్థాలను సేవించటం వలన కలిగే అనర్థాలను వివరించి చక్కగా మందులు వాడి కేంద్రం వారు అందించే పౌష్టిక ఆహారాన్ని తీసుకుని పూర్తిగా కోలుకున్న తరువాత కుటుంబ సభ్యుల తో ఆనంద మయ జీవితాన్ని గడపాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు శ్రీమతి దుర్గా దేవి, శ్రీ మిత్ర ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్ దొరబాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 20:** పరిశుభ్రత, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్రజల భాగస్వామ్యమే లక్ష్యంగా 'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' కార్యక్రమం తాళ్ళపూడి గ్రామంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తాళ్లపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించడం జరిగింది. అక్కడి పారిశుధ్య పరిస్థితులు, పిల్లలకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులకి, సిబ్బందికి సూచనలు చేస్తూ, చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలందరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, జనసేన పార్టీ ఇంచార్జ్ టి.వి.రామారావు, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి నామన పరమేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు సిద్దా దుర్గా ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ, కొఠారు వెంకట్రావు, వుడతా వీరేంద్ర, జడ్డు శ్రీను, కొప్పాక కోటీస్, కందుల నాగు, దూడల నాగు, అన్నమరెడ్డి రమణ, కోడి శంకరం, కూచిపూడి గణపతి, నామా నరేంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు వేసనాలకు వెళితే జీవితం నాశనమే




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 20.** తాడేపల్లిగూడెం పట్టణం లో దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు నిర్వహిస్తున్న దీరా కమ్యూనిటీ పీర్ లేడ్ ఇంటర్ వెంక్షన్ విద్యార్థుల కు నష ముక్త భారత్ అబయాన్ వారోత్సవాలు లో భాగంగా పట్టణం లోని సుబ్బారావు పేట మునిసిపల్ హై స్కూల్ నందు మత్తు మందులు వలన కలుగు అనర్ధల పై అవగాహనా సదస్సు నిర్వహించినారు.

ఈ కార్యక్రమం లో దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ పౌండర్ మల్లిపూడి మిత్ర విద్యార్థులకు మత్తు మందులు వలన కలుగు నష్టాలను వివరించారు. విద్యార్థులను ఎవరైనా మత్తు మందులు, చెడు అలవాట్లుకు పిలిస్తే మేము రాము అని కచ్చితంగా తిరస్కరించాలని, ఎవరైతే ప్రలోబాపరిచారో వారి గురించి మీ తల్లిదండ్రులు కు, ఉపాధ్యాయులు కు తెలిపి వారిని కూడా మీ లాగా మంచి విద్యార్థి గా మార్చాలని చెప్పారు

సైకాలాజిస్ట్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతు వత్తిడి లేకుండా డీ ఐ పిఅనే పద్ధతి లో మీరు పాఠాలు చదుకుంటే ఎటువంటి వత్తిడి కి లోను కారు అని, జ్ఞాపక శక్తీ కూడా బాగుంటుంది అని విద్యార్థులు ఎవరు చెడు అలవాట్లు వైపు పోకూడదు అని తెలిపారు.

ఉపాధ్యాయరాలు పి. శైలజ పిల్లలును ఉద్దేశించి మాట్లాడుతూ మత్తు మందులకు అలవాటు పడితే జీవితం పాడు అవ్వటమే కాకుండా చిన్న వయసు లోనే ముసలితనం వస్తుందని, త్వరగా మరణాలు సంభావిస్తాయని చెపుతూ, యువత జీవన ప్రమాణాలు దెబ్బతింటే దేశభివృధి కుంటూ పడు తుంది అని, మీ కుటుంబానికి సంగమ్ లో గౌరవం సన్నగిల్లుతుంది అనీ చెపుతూ, విద్యార్థులు మంచి పౌరులు గా ఉండాలని చెప్పారు

అనంతరం విద్యార్థులు అందరితో మల్లిపూడి మిత్ర మత్తు మందులు, చెడు అలవాట్లు వైపు వెళ్ళమని, భారత దేశాన్ని మత్తు రహిత దేశంగా తయారు చేయటానికి తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నరసాపురం డివిజన్‌లో కోర్టు వ్యవహారాల వేగవంతానికి సమీక్ష సమావేశం నిర్వహించిన డీఎస్పీ ఎం. సుధాకరరావు





**పెన్ పవర్ భీమవరం జూన్ 20** జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు నేర దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఎం. సుధాకరరావు నేడు నరసాపురం సబ్ డివిజన్ పరిధిలోని కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు లైజనింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కె. రజనీకుమార్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కోర్టు వ్యవహారాల పురోగతి, పెండింగ్ కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, లోక్ అదాలత్ నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ సుధాకరరావు మాట్లాడుతూ, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సి.సి. నంబర్లు కేటాయించబడని కేసులను వెంటనే గుర్తించి, సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో సమన్వయం చేసుకుని న్యాయస్థానాల నుంచి సి.సి. నంబర్లు పొందేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

వచ్చే నెల 11న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. అలాగే, ముద్దాయిలకు సమన్లు జారీ చేయడం, సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చూడడం వంటి అంశాల్లో కోర్టు కానిస్టేబుల్స్, లైజనింగ్ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

సాక్షులను విచారణకు ముందే పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వద్దకు తీసుకువెళ్లి కేసుపై పూర్తి అవగాహన కల్పించడం ద్వారా నేరస్థులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. కోర్టు వ్యవహారాల్లో పారదర్శకత, వేగవంతమైన పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి నెలా ఇలాంటి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని డీఎస్పీ తెలిపారు.

## నవీన్,కుటుంబానికి పదివేలు ఆర్థికసహాయం



**-మాజీ శాసనసభ్యులు ఎన్.ధనలక్ష్మి**

**-వై.యస్.ఆర్.సి.పి.మండలకమిటీ**

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.20:** ఇటీవల ట్రాక్టర్ బోల్తా పడి రేఖపల్లి గ్రామానికి చెందిన సారా నవీన్,మృతిచెందిన,విషయం అందరికీతెలిసిన విషయమే ఈ విషయం తెలుసుకున్నరంపచోడవరం నియోజకవర్గం మాజీశాసనసభ్యులు ఎన్.ధనలక్ష్మి, నవీన్,కుటుంబాన్ని,పరామర్శించి,ధైర్యంగాఉండాలని,కోరారు. రంపచోడవరంనియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఎన్.ధనలక్ష్మి,శనివారం వి.ఆర్.పురం వై.యస్.ఆర్.సి.పి. మండల కమిటీఆధ్వర్యంలోనవీన్ భార్యరమ్యశ్రీకు పది వేలరూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈసంద ర్భంగా వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ నవీన్ కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని,ఏఆపద వచ్చినా ఆదుకుంటుందని,వై.సి.పి.పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను, వై.సి.పి.పార్టీఅధిష్టానం గుర్తిస్తుందని,కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, రేఖపల్లి మాజీ సర్పంచ్ బేతి నాగేశ్వరరావు,వై.సి.పి.యూ త్,నాయకులు మోడెంనరేష్,ఎస్సీ సెల్ నాయకులు చీమ ల కాంతారావు,రేఖపల్లి కార్యకర్తలు భేతి సారయ్య,మాజీ వార్డు,మెంబర్స్ కొల్లుబోయన కన్నంరాజు భేతి తిరుపత య్య,సారానరసింహారావు,నవీన్ తల్లిదండ్రులు సారా వెం కటేశ్వర్లు,సారావెంకటలక్ష్మి,గంగుల నాగేశ్వరావు,కుటుంబ సభ్యులు సారా(పండు)రాజుమాజీ వార్డ్ మెంబర్ వేటకాని సుహాసిని,కళ్లి చిన్న ముత్యాలు,నాగలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

తొలి జిల్లా పర్యాటక మండలి సమావేశంలో కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20:** పోలవరం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన తొలి జిల్లా పర్యాటక మండలి (డీటీసీ) సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి పర్యాటకాభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, ఓఎస్డీ పంకజ్ కుమార్ మీనా, ఎస్‌డీఎఫ్‌వో అనుష తదితర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాపికొండలు, మారేడుమిల్లి, గుడిసె, రంప జలపాతాలు, జలతరంగిణి, పొల్లూరు వాటర్ ఫాల్స్ వంటి ప్రకృతి అందాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని అన్నారు. పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాపికొండల ప్రాంతంలో బోటింగ్, నదీ విహార యాత్రలకు సంబంధించిన సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు సమాచార కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పర్యాటకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

మారేడుమిల్లి, గుడిసె, పొల్లూరు, సీలేరు, రంప ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి, ట్రెక్కింగ్ మార్గాల ఏర్పాటు, సందర్శకుల విశ్రాంతి కేంద్రాల నిర్మాణంపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గిరిజన ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా హోమ్‌స్టే విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని తెలిపారు. హోమ్‌స్టే యజమానులకు శిక్షణ, నమోదు ప్రక్రియలు, నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించి పర్యాటకులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, వివిధ శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పి. అంబేద్కర్, పర్యాటక శాఖ అధికారి జి. దాసు, అటవీ శాఖ అధికారులు, ఐటీడీఏ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మునికూడలి ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా





**సీతానగరం, పెన్ పవర్, 20:జూన్ :** ఈ నెల 22వ తేదీన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారంనాడు సీతానగరం మండలంలోని మునికూడలి ఘాట్‌ను సందర్శించిన కమిషనర్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రతి ఏర్పాటును క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేలా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. ఈ పరిశీలనలో పీడీసీ మహేష్, డీపీఓ వి. శాంతామణి, ఇరిగేషన్, ఆర్ఎంసీ,పంచాయతీరాజ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాక్టీరియా మరియు పరాన్నజీవుల (పరాసైట్లు) వల్ల అనేక వ్యాధులు సోకే అవకాశం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 20:**జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ వారి ఆర్థిక సౌజన్యంతో మరియు హైదరాబాద్ వారి సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రం, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం వెంకట్రామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా వారు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం "చేపలు, రొయ్యలకు వచ్చే వ్యాధులు, నిర్ధారణ మరియు నివారణ పద్ధతులు" లో భాగంగా రెండవ రోజు అనగా 20.06.2026 శిక్షణ తరగతులలో భాగంగా మత్స్యశాస్త్ర నిపుణులు డా. కె. భీమేశ్వరరావు, సైంటిఫిక్ స్టాఫ్, మత్స్య పరిశోధన స్థానం, ఉండి వారు చేపల పెంపకంలో బ్యాక్టీరియా మరియు పరాన్నజీవుల (పరాసైట్లు) వల్ల అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. బ్యాక్టీరియా వ్యాధులలో ప్రధానంగా "రెడ్ డిసీజ్" (హేమరేజిక్ సెప్టిసీమియా) ముఖ్యం. ఇది 'ఏరొమోనాస్ హైడ్రోఫిలా' బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన చేపల శరీరంలో రక్తపు చారలు, రక్తపు గడ్డలు కనిపిస్తాయి, గుండె, కాలేయం, మూత్రపిండాలు ఉబ్బిపోతాయి మరియు కాలేయం పసుపు రంగులోకి మారుతుంది. చేప ఆహారం తీసుకోక బలహీనపడి చనిపోతుంది. అలాగే, టేల్ రోట్ వ్యాధి బ్యాక్టీరియా సంసర్గం వల్ల వస్తాయి, దీనివల్ల చేపల శరీరం నుండి శెపటిగ్ఝిజివ్ ఝిజివ్ అవుతుంది.

పరాన్నజీవుల వల్ల కలిగే వ్యాధులలో "చేప పేను వ్యాధి" (ఆర్గులోసిస్) ప్రధానం. తెల్లటి బల్లపరుపుగా ఉండే ఆర్గులస్ అనే పరాన్నజీవి చేప శరీరంపై చేరి రక్తాన్ని పీల్చుతుంది. ఇది ముందుగా రెక్కల కుదుళ్లపైకి చేరి, క్రమంగా మిగతా శరీర భాగాలకు విస్తరిస్తుంది. ఈ పరాన్నజీవులు చేపల కల్లలపై మరియు త్వచపై చిక్కని బస చేసి, శరీరంలోని పోషకాలను శోషించి స్వంత పోషణ చేస్తాయి, దీనివల్ల చేపల వయసు వేగంగా పెరగదు మరియు అస్వస్థత చెందుతాయి.

నీటి నాణ్యత, తాపము, ఆక్సిజన్ స్థాయిలు మరియు పోషకాల క్రమం తప్పుతున్నప్పుడు ఈ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. వ్యాధుల నివారణకు నీటి నాణ్యతను సమీకరించడం, అధిక ఆక్సిజన్ స్థాయిలు (5 జుజూఎ పైగా) ఉంచడం, నిమ ఎక్స్ట్రాక్ట్ వంటి స్వాభావిక్ నివారణ పద్ధతులు వాడడం మరియు ఆక్సిటెట్రాసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్ ఆహారంలో మిశ్రమం చేసి ఇవ్వడం వల్ల చేపలను కాపాడవచ్చు" ఖఅఎ శిక్షణ తరగతులు భాగంగా చేపలు మరియు రైలులో ముఖ్యంగా చేపల పెంపకం మరియు రియల్ పెంపకం లో వచ్చు బ్యాక్టీరియా మరియు పరాన్న జీవుల ద్వారా వ్యాపించు వ్యాధుల గురించి వివరించారు. ముఖ్యంగా చేపల్లో వచ్చు బ్యాక్టీరియల్ వ్యాధులు అయినా తాటాకు తెగులు, రెడ్డిసీజెస్, డ్రాప్సీ మొదలగు ముఖ్యమైన వ్యాధులు వాటి సంబంధిత బాక్టీరియా మొదలగునవి ఏరోమోనా స్, సూడోమోనాస్, ఫ్లోవోబాక్టరీ, విబ్రియో, మరియు వాటి అనుబంధిత బ్యాక్టీరియాస్ గురించి క్లుప్తంగా వివరించారు. మన ప్రాంతంలో నిర్వహించే చేపల చెరువులో ముఖ్యంగా చూసే ఈ వ్యాధుల వచ్చుటకు గల కారణాలు, చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, ఈ వ్యాధులు గుర్తించు విధానము మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈ ముఖ్యమైన వ్యాధుల గురించి పూర్తి వివరణ ఇచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నీటి నాణ్యతలు మేతల నాణ్యతలు మరియు చెరువు ల సరియైన పరిరక్షణ ద్వారా ఇటువంటి వ్యాధులను రాకుండా నిర్మూలించొచ్చని వ్యాధి సోకిన చేపలను గుర్తించి వాటిని వేరు చేయుట మరియు వాటికి తగిన మందులు, వ్యాధి నిర్మూలించేంతవరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. మధ్యాహ్నా శిక్షణ తరగతులలో భాగంగా చేపలలో ముఖ్యంగా సోకు పరాన్న జీవి వ్యాధుల గురించి, వాటి నిర్మూలన గురించి వివరించారు. చేపలలో వ్యాధులను కలిగించు పరాన్న జీవుల రకాలు, వాటి యొక్క జీవిత చక్రం, గుర్తించు విధానము మరియు నిర్మూలన పద్ధతుల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ పరాన్న జీవుల యొక్క జీవిత చక్రం లో ఒక జీవి పై పూర్తిగా ఆధారపడి ఉండటం, రెండు మూడు జీవులలో ఉంటూ చేపలలో వ్యాధులను కలిగించడం జరుగుతుంది.

ఈ వ్యాధులలో చూసుకుంటే ముఖ్యంగా మన ప్రాంతంలో చేప పేను, వంటి వ్యాధులు ముఖ్యమైనది. ఈ పరాన జీవులు గుడ్లు పెట్టి పెరిగే ఈ వ్యాధులను కలిగిస్తాయి. ఈ పరాన్న జీవులు వేరే వాటిపై ఆధారపడుతూ చేపలలో చేరి వ్యాధులను కలిగిస్తాయి మరియు చేప పేను జీవులు గుడ్లును పెట్టి వాటి యొక్క సంఖ్యను అభివృద్ధి చేసి చేపల పై వ్యాప్తి చెంది చేపలకు పుండ్లు, గాయాలు కలిగించడం మరియు అస్వస్థత గురిచేసి వాటి మరణాలకు కారణం అవుతున్నాయి. ఈ బ్యాక్టీరియల్ వ్యాధులు సోకిన చేపలలో ముఖ్యంగా మనం గమనించవలసింది వాటి యొక్క శరీర భాగం పై ఎర్రటి మచ్చలు, పుండ్లు, మరియు పోలుసులు లేచిపోవడం, కొన్ని సమయాల్లో వాటి యొక్క తోకలు విరిగిపోవడం జరుగుతుంది. ఈ బ్యాక్టీరియల్ మరియు పరానా జీవి వ్యాధులను నిర్మూలించుటకు ఇంటిబయాటిక్స్, జఊటుఖఇ, ఉప్పు ద్రావణము, పొటాషియం పరమాంగనేట్, కాపర్ సల్ఫేట్ వంటివి ముఖ్యమైన ఉపయోగిస్తారు

చేపల పెంపకంలో బ్యాక్టీరియా మరియు పరాన్న జీవులు (పరాసైట్లు) వల్ల అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. శిక్షణ తరగతుల భాగంగా చేపలు మరియు రైలులో ముఖ్యంగా చేపల పెంపకం మరియు రియల్ పెంపకంలో వచ్చు బ్యాక్టీరియా మరియు పరాన్నజీవుల ద్వారా వ్యాపించు వ్యాధుల గురించి వివరించారు. ముఖ్యంగా చేపల్లో వచ్చు బ్యాక్టీరియల్ వ్యాధులైన తాటాకు తెగులు, రెడ్డిసీజెస్, డ్రాప్సీ మొదలగు ముఖ్యమైన వ్యాధులు, వాటి సంబంధిత బాక్టీరియా మొదలగునవి ఏరోమోనాస్, సూడోమోనాస్, ఫ్లోవోబాక్టీరియం, మరియు వాటి సంబంధిత బ్యాక్టీరియాల గురించి క్లుప్తంగా వివరించారు. మన ప్రాంతంలో నిర్వహించే చేపల చెరువులో ముఖ్యంగా చూసే ఈ వ్యాధులు వచ్చుటకు గల కారణాలు, చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, ఈ వ్యాధులు గుర్తించు విధానము మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పూర్తి వివరణ ఇచ్చారు. నీటి నాణ్యతలు, మేతల నాణ్యతలు మరియు చెరువుల సరియైన పరిరక్షణ ద్వారా ఇటువంటి వ్యాధులను రాకుండా నిర్మూలించొచ్చని, వ్యాధి సోకిన చేపలను గుర్తించి వాటిని వేరు చేయుట మరియు వాటికి తగిన మందులు, వ్యాధి నిర్మూలించేంతవరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.

బ్యాక్టీరియా వ్యాధులలో ప్రధానంగా "రెడ్ డిసీజ్" (హేమరేజిక్ సెప్టిసీమియా) ముఖ్యం. ఇది 'ఏరొమోనాస్ హైడ్రోఫిలా' బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన చేపల శరీరంలో రక్తపు చారలు, రక్తపు గడ్డలు కనిపిస్తాయి, గుండె, కాలేయం, మూత్రపిండాల, మరియు కాలేయం పసుపు రంగులోకి మారుతుంది. చేప ఆహారం తీసుకోక బలహీనపడి చనిపోతుంది. అలాగే, టేల్ రోట్ (ఖఅశ్రీ =శే) వ్యాధి బ్యాక్టీరియా సంసర్గం వల్ల వస్తాయి, దీనివల్ల చేపల శరీరం నుండి శెపటిగ్ఝిజివ్ ఝిజివ్ అవుతుంది. ఈ బ్యాక్టీరియల్ వ్యాధులు సోకిన చేపలలో ముఖ్యంగా మనం గమనించవలసింది వాటి యొక్క శరీర భాగం పై ఎర్రటి మచ్చలు, పుండ్లు, మరియు పోలుసులు లేచిపోవడం, కొన్ని సమయాల్లో వాటి యొక్క తోకలు విరిగిపోవడం జరుగుతుంది.

మధ్యాహ్నా శిక్షణ తరగతులలో భాగంగా చేపలలో ముఖ్యంగా సోకు పరాన్నజీవి వ్యాధుల గురించి, వాటి నిర్మూలన గురించి వివరించారు. చేపలలో వ్యాధులను కలిగించు పరాన్నజీవుల రకాలు, వాటి యొక్క జీవిత చక్రం, గుర్తించు విధానము మరియు నిర్మూలన పద్ధతుల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ పరాన్నజీవుల యొక్క జీవిత చక్రంలో ఒక జీవి పై పూర్తిగా ఆధారపడి ఉండటం, రెండు మూడు జీవులలో ఉంటూ చేపలలో వ్యాధులను కలిగించడం జరుగుతుంది. ఈ వ్యాధులలో చూసుకుంటే ముఖ్యంగా మన ప్రాంతంలో చేప పేను, వంటి వ్యాధులు ముఖ్యమైనది. ఈ పరాన్నజీవులు గుడ్లు పెట్టి పెరిగే ఈ వ్యాధులను కలిగిస్తాయి. ఈ పరాన్నజీవులు వేరే వాటిపై ఆధారపడుతూ చేపలలో చేరి వ్యాధులను కలిగిస్తాయి మరియు చేప పేను జీవులు గుడ్లును పెట్టి వాటి యొక్క సంఖ్యను అభివృద్ధి చేసి చేపల పై వ్యాప్తి చెంది చేపలకు పుండ్లు, గాయాలు కలిగించడం మరియు అస్వస్థత గురిచేసి వాటి మరణాలకు కారణం అవుతున్నాయి.

పరాన్నజీవుల వల్ల కలిగే వ్యాధులలో "చేప పేను వ్యాధి" (ఆర్గులోసిస్) ప్రధానం. తెల్లటి బల్లపరుపుగా ఉండే ఆర్గులస్ అనే పరాన్నజీవి చేప శరీరంపై చేరి రక్తాన్ని పిలుస్తాయి. ఇది ముందుగా రెక్కల కుదుళ్లపైకి చేరి, క్రమంగా మిగతా శరీర భాగాలకు విస్తరిస్తుంది. ఈ పరాన్నజీవులు చేపల కల్లలపై మరియు త్వచపై చిక్కని బస చేసి, శరీరంలోని పోషకాలను శోషించి స్వంత పోషణ చేస్తాయి, దీనివల్ల చేపల వయసు వేగంగా పెరగదు మరియు అస్వస్థత చెందుతాయి.

నీటి నాణ్యత, తాపము, ఆక్సిజన్ స్థాయిలు మరియు పోషకాల క్రమం తప్పుతున్నప్పుడు ఈ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. వ్యాధుల నివారణకు నీటి నాణ్యతను సమీకరించడం, అధిక ఆక్సిజన్ స్థాయిలు (5 జుజూఎ పైగా) ఉంచడం, నివారణ పద్ధతులు వాడడం మరియు ఆక్సిటెట్రాసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్ ఆహారంలో మిశ్రమం చేసి ఇవ్వడం వల్ల చేపలను కాపాడవచ్చు. ఈ బ్యాక్టీరియల్ మరియు పరాన్నజీవి వ్యాధులను నిర్మూలించుటకు ఇంటిబయాటిక్స్, జఊటుఖఇ, ఉప్పు ద్రావణము, పొటాషియం పరమాంగనేట్, కాపర్ సల్ఫేట్ వంటివి ముఖ్యమైన ఉపయోగిస్తారు.

శిక్షణ తరగతుల్లో భాగంగా మత్స్య శాస్త్ర నిపుణులు డా. శివ కుమార్, సైంటిఫిక్ స్టాఫ్, మత్స్య పరిశోధన సాధన ఉండి వారు. ఈ కార్యక్రమంలో చేపలు మరియు రొయ్యలకు సోకు వైరస్ మరియు ఫంగస్ వ్యాధుల గురించి వివరించారు. సరైన నీటి నాణ్యత మరియు మేతల నాణ్యత పర్యటనలు పాటించకపోతే చేపలు వైరస్ మరియు ఫంగస్ జీవుల బారినపడి మరణించడానికి ఆస్కారం ఉన్నది. చేపల్లో వచ్చే వైరల్ మరియు ఫంగల్ వ్యాధులు పెంపకంలో చాలా నష్టం కలిగిస్తాయి అని. వైరల్ వ్యాధులు వైరస్ల వల్ల వస్తాయి; ఇవి త్వరగా వ్యాప్తి చెంది చేపల్లో ఆకలి తగ్గడం, శరీరం నల్లబడటం, గిల్లులు తెల్లగా మారడం, పొట్ట ఉబ్బడం, రక్తస్రావం, కళ్ళు ఉబ్బడం వంటి లక్షణాలు చూపుతాయి, మరియు చాలా సందర్భాల్లో ప్రత్యేక చికిత్స ఉండదు కాబట్టి నివారణే ముఖ్యము సూచించారు. ఫంగల్ వ్యాధులు శిలీంద్రాల వల్ల వస్తాయి; ఇవి సాధారణంగా గాయపడిన, బలహీనమైన లేదా ఒత్తిడిలో ఉన్న చేపల్లో ఎక్కువగా కనిపిస్తాయి, మరియు చర్మం, గిల్లులు, గుడ్లపై తెల్లటి పత్తిలాంటి పెరుగుదల, గిల్లుల కుళ్ళు, శ్వాసలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. నీటి నాణ్యత సరిగ్గా లేకపోవడం, గిడుగు ఎక్కువగా ఉండడం, ఆక్సిజన్ తక్కువగా ఉండడం, మరియు చేపలకు గాయాలు కావడం ఈ రెండు రకాల వ్యాధులను పెంచుతుంది. కాబట్టి శుభ్రమైన నీరు, సరైన దాణా, తక్కువ ఒత్తిడి, కొత్త చేపలను క్వారంటైన్లో ఉంచడం, మరియు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వేరు చేయడం చాలా అవసరం వివరించారు. కోర్స్ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ ఌ హెడ్ డాక్టర్ సి.హెచ్. కిరణ్ కుమార్. కోర్స్ కో–డైరెక్టర్ డాక్టర్ ఎ. దేవివరప్రసాద్ రెడ్డి మరియు కోఆర్డినేటర్లు డాక్టర్ ఇ. రేఖ, డాక్టర్ కె. అర్చనలు ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

# తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా:







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 20:**సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ సెక్రటరీ మండలపర్తి హరీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడికొండ శ్రీనివాసు, నాయకులు ఎమ్. కాటంరాజు, ముత్యం మరియు మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ హైకోర్టు తీర్పుల ప్రకారం తక్షణమే రెగ్యులరైజ్ (శాశ్వతం) చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పట్టణ జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని, విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన కార్మికుల పిల్లలకు తక్షణమే కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, 1953 నుండి అమల్లో ఉన్న సాంప్రదాయం ప్రకారం మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నూతన పీఆర్సీ నియమించి 30% మధ్యంతర భృతి (ఐ ఆర్ ) ప్రకటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే, రాబోయే రోజుల్లో కార్మికులందరినీ ఏకం చేసి ఉద్యమాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్తామని, నిరసనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం, పైన పేర్కొన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని (మెమొరాండం) తాడేపల్లిగూడెం మున్సిపల్ మేనేజర్‌కు రవి సుధాకర్ కార్మిక సంఘ నాయకులు సమర్పించారు.

# రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 20:**
ప్రజలకు నేరుగా సేవలందించే శాఖగా రెవెన్యూ శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి అంకితభావంతో, నిబద్ధతతో తమ బాధ్యతలను నిర్వర్తిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ శాఖలో నేరుగా పనిచేసే సిబ్బందితో పాటు ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు, ఉద్యోగులు కూడా అదే నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ శాఖ పనితీరుకు తోడ్పడుతున్నారని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమలులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వెబ్‌ల్యాండ్ నిర్వహణ, భూ రికార్డుల నిర్వహణ, రీ–సర్వే, ల్యాండ్ రికార్డుల శుద్ధీకరణ, భూ సంబంధిత వివాదాల పరిష్కారం వంటి అంశాల్లో అత్యంత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు వినూత్న ఆవిష్కరణలను అమలు చేసే ప్రక్రియలో రెవెన్యూ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో గడిపే సమయం తక్కువగా ఉన్నప్పటికీ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి ఉద్యోగి మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా శాఖ సేవలను గుర్తు చేసుకుంటూ అధికారులు, ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ భాస్కర్ రెడ్డి , రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, రిటైర్డ్ ఉద్యుగుల, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. 70 కోట్లతో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ సమగ్ర అభివృద్ధి





- **తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ లో జరుగుతున్న అమృత్ భారత్ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**
- **త్వరలో తాడేపల్లిగూడెంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్**
- **ప్రత్తిపాడు, నవాబ్ పాలెం, అరుళ్ల వద్ద మూడు ఆర్‌ఓబిల నిర్మాణం.**

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్.జూన్ 20 :**తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌కు మహర్దశ ప్రారంభమైందని, స్టేషన్ సమగ్ర అభివృద్ధి కోసం 70 కోట్ల కేంద్ర నిధులతో పనులు చురుగ్గా జరుగుతున్నాయని కేంద్ర ఉక్కు భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ శనివారం పరిశీలించారు. ఆయనతో పాటు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే ఉన్నతాధికారులతో కలిసి పనుల పురోగతిపై కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించి, అధికారుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ?అనంతరం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 46.22 కోట్లు, గతి శక్తి పథకం కింద ఇంటర్నల్ ఎఫ్ఓబి నిర్మాణానికి రూ. 10.22 కోట్లు కేటాయించామన్నారు. అలాగే గూడ్స్ షెడ్ రోడ్డు అభివృద్ధి, గూడ్స్ షెడ్ ఆఫీస్, హమాలీ షెడ్ నిర్మాణాల కోసం మరో రూ. 16.55 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ?అమృత్ భారత్ పథకంలో భాగంగా మొదటి దశ కింద రూ. 27.12 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని శ్రీనివాస వర్మ తెలిపారు. రెండో దశ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. గూడ్స్ షెడ్ నిర్మాణ పనుల కోసం 60 రోజుల పాటు లోడింగ్ పనులను ఆపివేయాల్సి రావడం వల్లే కొంత జాప్యం జరిగిందని, అయితే మరో వారం రోజుల్లో ఆ పనులు కూడా ప్రారంభమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ?ఇక తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని ప్రత్తిపాడు, నవాబ్ పాలెం, అరుళ్ల వద్ద మూడు ఆర్ఓబి (=ాదీ)ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, ఈ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని కేంద్రమంత్రి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం తాడేపల్లిగూడెం స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా హాల్ట్ సదుపాయం కల్పిస్తామని ఆయన ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీదేవి,బీజేపీ సీనియర్ నాయకులు ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, గట్టిం సింధు, బీజేపీ పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ తదితర ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## డ్రైనేజీ, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత- ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 20:**
రాజమహేంద్రవరం నగర పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రహదారులు, ఇతర మౌలిక వసతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శాసన మండలి సభ్యులు(ఎమ్మెల్సీ) సోము వీర్రాజు శనివారం తన కార్యాలయంలో మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని రూపా నగర్, స్వరూప్ నగర్, తారకరామ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.
సమీక్షలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యలు, రహదారుల దుస్థితిని దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా చేపట్టాల్సిన కొత్త పనులను గుర్తించాలని సూచించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల పూడికతీత పనులను వేగవంతం చేయడంతో పాటు, ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.ం

## బి.జె.పి.ఆద్వర్యంలోజనకల్యాణ్,శిబిరం



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.20**
బారతీయ జనతాపార్టీ రాష్ట్రఅధ్యక్షులు పి.వి.ఎన్. మాదవ,ఓ.బి.సి.రాష్ట్రఅధ్యక్షులు వంగరగోపి,శ్రీ నివాసరావు ఆదేశాలు మేరకు రాష్ట్రకిషాన్,మట్టర్భా కార్యదర్శి నోములరామారావుఅధ్యక్షతన ఓబిసి, బిజెపి జిల్లాఅధ్యక్షులు ఐ.వి.వి.ప్రసాద్,రావు ఆద్వర్యంలో వి. ఆర్.పురం సచివాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,12సంవత్సరములు,మనదేశానికి సుపరిపాలన అందిస్తు,నరేంద్రమోడీ ప్రవేశ పెట్టినపదకాలను బి.జె.పి. మరియు పోర్టల్,సిబ్బంది.సంయుక్తంగా జనకల్యాణ్, శిబిరం నిర్వహించడంజరిగింది.ఈసందర్భంగా రాష్ట్ర కిషాన్,మట్టర్భాకార్యదర్శి నోములరామారావు మాట్లాడు తూ బి.జె.పి.ఓ.బి.సి.రాష్ట్ర నాయకత్వం నిర్వహించడం గొప్ప విషయమని,నరేంద్రమోడీ ప్రవేశ పెట్టిన సుకన్య యట్జజన,అటల్,భీమాయట్జజన,మట్నదలగుపదకాలుజనరంజకమైనవని,పోస్టల్,సిబ్బంది.ప్రతి ఒక్కరూభాధ్యతగా మెలగాలని,ప్రజల మన్ననలుపొందాలని,కోరారు.బి.జె.పి .ఓబిసి,జిల్లాఅధ్యక్షులు ఐ.వి.వి.ప్రసాద్,రావు మాట్లాడు తూ నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగంచేసుకొని,ప్రతిపేదవాడు,లక్షదికారిగాఎదగాలని,ఆకాంక్ష అంటూ తెలిపారు.విద్యావ్యవస్థలోపెను మార్పులురావాలని,ఒకటోవతరగతినుండిఐదోవతరగతివరకు బేసిక్స్,నేర్పి,ఆరవ తరగతినుండి,పి.జీ.వరకు ఒక పూటచదువురెండవపూటవ్యవసాయం,చేతి వృత్తులు ప్రా టికల్,గా చేపట్టి మట్టడల్,పాఠశాలను, ప్రభుత్వాలు తీసు కురావాలని,తద్వారా విద్యార్థి,దిశనుండిమనదేశం యెక్క ప్రదాన వృత్తులు వ్యవసాయం,చేతువృత్తుల ఆధారిత దేశంమని,విద్యార్థి,కి తెలుస్తుందని,విద్యార్థిచెడు అలవా ట్లకుదూరంగాఉండి,వారి కాళ్లమీదనిలబడి వారి కుటుం బాలకు,దేశానికి వెన్నుముకగా నిలుస్తారని,కోరారు.ఈ కార్యక్రమంలో బి.జె.పి.ఒ.బి.సి.కార్యకర్తలు పోస్టల్, సిబ్బంది. తదితరులుపాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై విస్తృత అవగాహన కల్పించాలి-ఏఈఆర్ఓ లక్ష్మీ లావణ్య



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 20:**ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ--2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తాళ్లపూడి నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారి లక్ష్మీ లావణ్య సూచించారు. శనివారం తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్--2026 అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితా శుద్ధీకరణ ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా గణన ఫారాన్ని పూర్తి చేసి అవసరమైన ఆధార పత్రాలతో బూత్ స్థాయి అధికారికి అందజేయాలని కోరారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర వివరాలు ఖచ్చితంగా నమోదు అవుతాయని వివరించారు.
అనంతరం అన్నదేవరపేట గ్రామంలో ఏఈఆర్ఓ గణన ఫారాల పంపిణీ, ధృవీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఫారాల పంపిణీ, వివరాల సేకరణను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ

**గంగవరం మండల రైతులకు రూ.2.6 కోట్ల పెట్టుబడి సాయం**

**గంగవరం, పెన్ పవర్, జూన్ 20:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో గంగవరం మండల రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద రూ.7,000 చొప్పున ఆర్థిక సాయం జమ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ తెలిపారు.ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పీఎం కిసాన్ పథకం 23వ విడత కింద 3,222 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.60 లక్షలు జమ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అన్నదాత సుఖీభవ పథకం రెండో సంవత్సరం తొలి విడత కింద 4,161 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున రూ.2 కోట్లు విడుదల చేశారు.ఈ రెండు పథకాల ద్వారా మొత్తం రూ.2.60 కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి రాయితీగా జమ చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులు ఈ నిధులను వ్యవసాయ అవసరాలకు వినియోగించుకొని పంటల సాగును మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాసనాలు



**తాళ్లపూడి, పెన్ పవర్, జూన్ 20:**అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం తాళ్లపూడి శ్రీ విజేత హై స్కూల్ నందు స్కూల్ విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ యోగా ద్వారా విద్యార్థుల్లో మానసిక, శారీరక వికాసం కలుగుతుందని, తద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు. యోగా ట్రైనర్ కె వెంకట్ విద్యార్థులకు అంతర్జాతీయ యోగా దే విశిష్టత వివరించి ఆ తర్వాత యోగాసనాలు చేయించారు.

## రంపచోడవరం నియోజకవర్గంలో 42.65 శాతం ఎన్యుమరేషన్ పూర్తి

**స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి ప్రజలు సహకరించాలి: ఈఆర్ఓ సూరపాటి ప్రశాంత్ కుమార్**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20:**భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు 53-రంపచోడవరం (ఎస్టీ) శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2026 (ఎస్ఐఆర్-2026) కార్యక్రమం వేగంగా కొనసాగుతున్నట్లు ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో జూన్ 15 నుంచి బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.జూన్ 20 నాటికి నియోజకవర్గంలోని మొత్తం 2,78,518 మంది ఓటర్లలో 1,18,787 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 42.65 శాతం పురోగతి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 807 ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు.ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, ద్వంద్వ నమోదులో ఉన్న ఓటర్ల పేర్ల తొలగింపు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూలై 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయడం, ఓటరు వివరాల్లోని తప్పులను సరిదిద్దడం, ఫోటోల నాణ్యత మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.బూత్ లెవల్ అధికారులు అందజేస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తిగా నింపి, అవసరమైన ఆధార పత్రాలతో తిరిగి అందజేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈఆర్ఓ సూరపాటి ప్రశాంత్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**సమాజానికి సేవ చేసే ఉత్తమ ఫార్మాసిస్టులుగా ఎదగాలి -- డాక్టర్ అవినాష్**












**గంగవరం, పెన్ పవర్, జూన్ 20:**
ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 2022-2026 బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అవినాష్ గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, వృత్తిపరమైన నైతిక విలువలు, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఆదర్శ కాలేజ్ నుంచి పట్టభద్రులవుతున్న విద్యార్థులు దేశానికి, సమాజానికి ఆదర్శవంతమైన ఫార్మాసిస్టులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.
కళాశాల చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంలో చూపిన కృషి అభినందనీయమని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.కళాశాల కార్యదర్శి డాక్టర్ నాగమణి మాట్లాడుతూ పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉన్నత విద్యను అభ్యసించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జీవితంలో సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఉందని, కష్టపడినంత మేరకు అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు.డైరెక్టర్ డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీతో సరిపెట్టుకోకుండా ఉన్నత విద్య, ప్రత్యేక నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు.డాక్టర్ ప్రవళిక మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్లకు, అలాగే అకాడమిక్, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు అందజేసి సత్కరించారు.
గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులు మాట్లాడుతూ తమకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యాలను అందించిన ఆదర్శ కాలేజ్ యాజమాన్యానికి, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ విజయానికి అండగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుజిని, కళాశాల కోఆర్డినేటర్ పి శ్రీనివాస్, కళాశాల యాజమాన్య సభ్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నంపాలెంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం



**గంగవరం, పెన్ పవర్, జూన్ 20:** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగవరం మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని చిన్నంపాలెం గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, కందుల సాయి, కుంజం రామకృష్ణ దొర ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందుబాటులో లేని మారుమూల గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గంగవరం మండలంలో ఈ నెలలో మొత్తం ఏడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.చిన్నంపాలెం గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అన్నిక నాగేశ్వరరావు, దుక్కర నాగు, స్వర్ణ, డాక్టర్ నిఖిత్, జీఎన్ఎం చిట్టీ, ఫార్మసిస్ట్ స్వర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ సిబ్బంది నాని, ఏఎన్ఎంలు అరుణ, పొట్టమ్మ, ఆశా కార్యకర్తలు వీరమణి, తబితాతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల బాధిత కుటుంబానికి రూ.12.50 లక్షల సాయం




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20:** 2021లో మావోయిస్టుల చేతిలో మృతి చెందిన యాటపాక మండలం బండిరేవుల గ్రామానికి చెందిన మడి రాజ్‌కుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12.50 లక్షల ఆర్థిక సాయం అందించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ మొత్తాన్ని బాధితురాలు మడి రోజా బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసినట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. అలాగే రంపచోడవరంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో పోలీసు శాఖ తరపున రూ.51 వేల విలువైన చెక్కును మడి రోజాకు అందజేశారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌లకు మడి రోజా కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

మొహమ్మద్ జమాల్ ఖాన్



**చింతూరు, పన్ పవర్, జూన్ 20:** రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద చింతూరు మండల రైతులకు రూ.1 కోటి 96 లక్షల ఆర్థిక సహాయం విడుదల చేసిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు ఈ నిధులు ఉపయోగపడతాయని, రైతు కుటుంబాల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన, మార్కెటింగ్ సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులు ఆర్థికంగా బలోపేతం అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బట్ట లక్ష్మయ్య, మండల వ్యవసాయ అధికారి రత్నప్రభ, మార్కెట్ కమిటీ సభ్యులు సల్మాన్ రాజు, సొసైటీ బ్యాంకు సభ్యులు చంద్రయ్య, అణిగి రాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రైతుల అభ్యున్నతికి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్





- పోలవరం జిల్లాలో 40,358 మంది రైతుల ఖాతాల్లో రూ.28.16 కోట్లు జమ
- రైతులు వచ్చిన నిధులను వ్యవసాయానికే వినియోగించుకోవాలి : కలెక్టర్ కె. దినేష్ కుమార్
- ప్రకృతి వ్యవసాయం, వాణిజ్య పంటలపై రైతులు దృష్టి పెట్టాలి : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20:** పోలవరం జిల్లాలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాలను అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రంపచోడవరం మండలం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రైతుల ఖాతాల్లో నిధుల జమ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తదితరులు హాజరయ్యారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 40,358 మంది రైతులకు మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.28.16 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.7.99 కోట్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు.రైతులు ఈ నిధులను వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవాలని, అధిక వడ్డీ రుణాలకు దూరంగా ఉండాలని సూచించారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లాలో సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్)ను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని, ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఉద్యానవన పంటలను మైక్రో ఇరిగేషన్ ద్వారా సాగు చేసే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.అలాగే రూ.60 కోట్ల వ్యయంతో జలధార పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పామాయిల్, రబ్బర్, ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, యూరియా, డీఏపీ కొరత లేకుండా ఆధార్ ఆధారిత వ్యవస్థ ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాలను అమలు చేస్తున్నాయని అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసరించాలని సూచించారు.వాణిజ్య పంటలు, ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా వివిధ పథకాల వివరాలు, వ్యవసాయ సలహాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**మండలాల వారీగా లబ్ధి**

- రంపచోడవరం : 5,913 మంది రైతులకు రూ.4.09 కోట్లు
- దేవీపట్నం : 2,729 మందికి రూ.1.90 కోట్లు
- మారేడుమిల్లి : 3,496 మందికి రూ.2.44 కోట్లు
- అడ్డతీగల : 5,381 మందికి రూ.3.75 కోట్లు
- గంగవరం : 4,161 మందికి రూ.2.72 కోట్లు
- వై.రామవరం : 5,206 మందికి రూ.3.68 కోట్లు
- రాజవొమ్మంగి : 5,490 మందికి రూ.3.75 కోట్లు
- చింతూరు : 2,807 మందికి రూ.1.96 కోట్లు
- వీఆర్‌పురం : 652 మందికి లబ్ధి
- వేటపాక, కూనవరం మండలాల రైతులకు కూడా కోట్ల రూపాయల మేర ఆర్థిక సహాయం అందింది.

అనంతరం రూ.28.16 కోట్ల ప్రతీకాత్మక చెక్కును రైతులకు అతిథులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రామ్మోహన్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్లు, కేవీకే శాస్త్రవేత్తలు, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం: కేంద్రమంత్రి శ్రీనివాస్





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జూన్ 20:** ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

స్థానిక మాగంటి కళ్యాణ మండపంలోశనివారం జరిగిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్ పురోగతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి గల నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను కూడా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని శ్రీనివాస్ వర్మ అన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు శ్రీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ఉంగుటూరు శాసనసభ్యులు పచ్చమట్ల ధర్మరాజు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బొలిశెట్టి రాజేష్, తోటరాజు,భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, ఈతకోట తాతాజీ, పాలూరి వెంకటేశ్వరరావు,పుల్ల బాబి, చేపల మంగ బాయ్, సబ్జా సుబ్బు,వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, దువ్వ శ్రీను, కిలపర్తి వెంకటరావు, గొర్రెల శ్రీధర్, పరిమి రవికుమార్, ఆర్డిఓ ఎమ్మార్వో రాజరాజేశ్వరి, ఎమ్మార్వో సునీల్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# పెదాగెద్దాడ జెడ్పీ హైస్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సు






### ఉత్తమ నడవడిక, సేవాగుణం ఉన్న విద్యార్థులే స్ఫూర్తిదాయకం: మేజిస్ట్రేట్ మురళీ గంగాధర్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 20:** గౌరవ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు రంపచోడవరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పెదాగెద్దాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి రంపచోడవరం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మురళీ గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో మేజిస్ట్రేట్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి ఉన్నతాధికారులని, సమాజం పట్ల బాధ్యతతో, పెద్దల పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు వాటి దుష్పరిణామాలపై ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.పేదలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు జాతీయ న్యాయ సేవా సంస్థ (చీూూూా) ద్వారా అందుతున్న ఉచిత న్యాయ సహాయం, టోల్‌ఫ్రీ నంబర్ 15100 గురించి వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా జిల్లా, మండల న్యాయ సేవా సంస్థలను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, న్యాయవాదులు ఏఆర్ఆర్ భగవాన్, టి. వీరబాబు పాల్గొని విద్యార్థులకు చట్టపరమైన అవగాహన కల్పించారు. పాఠశాల ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సు విద్యార్థుల్లో న్యాయ అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

# అన్నదాత సుఖీభవ జగ్గంపేట నియోజకవర్గ రైతులకు రూ.20.35 కోట్లు ఎమ్మెల్యే నెహ్రూ






**గోకవరం పెన్ పవర్ జూన్ 20** :--2026-27 లో మొదటి విడత విడత అన్నదాత సుఖీభవ మరియు పి యమ్ కిసాన్ పథకం లో జగ్గంపేట నియోజకవర్గం 4 మండలాలు కలిపి రూ.20.35 కోట్లు 30557 మంది రైతు ఖాతాలకు వేయడం జరిగిందని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం ఎంపీడీవో కార్యాలయం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ధాన్యలను ఆయన పరిశీలించారు. ఆయన చేతుల మీదుగా రైతులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు శ్రీకారం చుట్టిందని, ప్రతి ఒక్కరు యూరియా వాడకం తగ్గించాలని సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన రైతులకు సూచించారు.ప్రతి రైతుకి 7000 రూపాయలు ఇవ్వడం జరిగిందనన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు నియోజవర్గ నాయకులు, మండల నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జగ్గంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఈ కార్యక్రమం గోకవరంలో నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో 30557 మంది రైతులకు గాను అన్నదాత సుఖీభవ రూ.15.28 కోట్లు, పిఎం కిసాన్ రూ.5.07 కోట్లు అందిస్తున్నారు.

# ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ గ్రాడ్యుయేషన్ డే 2026





**గోకవరం పెన్ పవర్ జూన్ 20**:--ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో 2022-2026 బ్యాచ్ దీఫార్మసీఎ, విద్యార్థు లకు వైభవంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. త్రినాధ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అవినాష్ విచ్చేసి విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు సమాజ ఆరోగ్యానికి సేవ చేసే బాధ్యతను గుర్తించి, నీతి, నిజాయితీతో పనిచేయాలి. ఆదర్శ కాలేజ్ నుండి వెళ్తున్న మీరు దేశానికి,మంచి ఫార్మాసిస్టులుగా పేరు తెచ్చుకోవాలి అని విద్యార్థులకు సూచించారు.

కళాశాల చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థుల కృషిని అభినందిస్తూ,భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.సెక్రటరీ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఉన్నత విద్యను అభ్యసించాలని తెలియజేశారు.డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు సమయ పాలనన్నది అత్యంత ముఖ్యమని ఎంత కష్టపడితే అంత అభివృద్ధి ఉంటుందని తెలియజేశారు.డైరెక్టర్ డాక్టర్ హారిక మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో డిగ్రీ కాకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని దానికి ఇప్పుడు తోడు ఉంటుందని తెలియజేశారు.డాక్టర్ ప్రవళిక మాట్లాడుతూ రోగికి రోగాన్ని తగ్గట్టు మందులు ఎలా ఇస్తారో అలాగే బయట ప్రపంచానికి వెళ్ళినప్పుడు సమయపాలనతో ఎదగాలని తెలియజేశారు.ఈ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన టాపర్స్‌కు, అకాడమిక్, కల్చరల్,స్పోర్ట్స్ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ ప్రదానం చేశారు.చివరగా విద్యార్థులు మాట్లాడుతూ ఆదర్శ మాకు అత్యుత్తమ శిక్షణ క్రమశిక్షణ ఇచ్చిందన్నే ప్రధాన కారణం నేనేనని మా యొక్క రోగత్కి సహకరించిన మా తల్లిదండ్రులతో పాటు గురువులకు పాదాభివందనాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, అన్ని డిపార్ట్‌మెంట్ల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, గ్రాడ్యుయేట్స్ తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం చివరలో ఆర్గనైజేషన్ కమిటీ కన్వీనర్ వోట్ ఆఫ్ థాంక్స్ తెలియజేశారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.




# హైస్కూల్ విద్యార్థులకు డైరీల అందజేత

దాత సహకారంతో 250 మంది విద్యార్థులకు పంపిణీ



**రావులపాలెం, పెన్ పవర్: జూన్ 20**:మండల పరిధిలోని రావులపాడు జడ్పీ హైస్కూల్‌లో గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, దాత పెచ్చేటి చిన్నారావు రూ.25 వేల విలువైన 250 స్టూడెంట్ డైరీలను విద్యార్థులకు అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా డైరీలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, స్టూడెంట్ డైరీ ద్వారా విద్యార్థులు రోజువారీ హోంవర్క్‌ను అదే రోజు పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ డైరీ విధానం ప్రవేశపెట్టడం వినూత్నమని, ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో మరింత బాధ్యతను పెంచడంతో పాటు ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా దాత పెచ్చేటి చిన్నారావును అభినందించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, మాజీ సర్పంచ్ బాబ్జి, గెద్దం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.వి. శేఖర్, జి. సునీత, సత్యవతి, ఆంజనేయులు, శ్యామల, వీరవేణి, మేరీ జాన్స్, వసుంధర, వెంకటలక్ష్మి, సుజాత, గోపాలకృష్ణ, మేక సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

# మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానానికి రూ.2.40 లక్షల ఆదాయం



**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 20**: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, విరాళాల ద్వారా రూ.2,40,730 ఆదాయం సమకూరింది.దేవస్థానం వివరాల ప్రకారం ముఖమండప సేవల ద్వారా రూ.7,000, ఏకాదశ రుద్ర తైలాభిషేకాల ద్వారా రూ.36,000, మహాన్యాస పూర్వక తైలాభిషేకాల ద్వారా రూ.36,925, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.16,480, తిలదానం ద్వారా రూ.150, స్వయం హోమం ద్వారా రూ.1,600 ఆదాయం లభించింది. వీటి ద్వారా మొత్తం రూ.98,155 సమకూరింది.అదనంగా ఫోన్‌పే ద్వారా రూ.19,435, పరోక్ష పూజల ద్వారా రూ.1,01,700, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.21,440 లభించాయి. దీంతో శనివారం ఒక్కరోజే మొత్తం రూ.2,40,730 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. శ్రీ స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ఆర్థిక సమగ్రతకు బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలి : ఎల్డీఎం సి.హెచ్.వి. ప్రసాద్..

పెద్దాపురంలో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం...






**శంఖవరం /పెద్దపురం పెన్ పవర్ జూన్ 20:-**

కాకినాడ జిల్లా పెద్దాపురం మండల అభివృద్ధి కార్యాలయంలో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం శనివారం లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్డీఎం) సి.హెచ్.వి. ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్డీఎం ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ఆర్థిక సేవలు అందేలా బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమావేశానికి నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ వై. సోమునాయుడు, సిడ్బి ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఎ. రామకృష్ణ, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎల్డీఎం సి.హెచ్.వి. ప్రసాద్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ ఖాతాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి, ఖాతాదారుల నిధుల భద్రతకు బ్యాంకులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.

ఎంఎస్ఎంఈ రంగం దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముక వంటిదని పేర్కొన్న ప్రసాద్, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే పథకాల అమలుపై దృష్టి సారించాలని కోరారు.

అదేవిధంగా ఖాతాదారుల కేవైసీ వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ఎల్డీఎం ప్రసాద్ స్పష్టం చేశారు. కేవైసీ పూర్తి చేయడం ద్వారా ఖాతాదారుల ఖాతాలకు మరింత భద్రత లభిస్తుందని తెలిపారు.

జిల్లాలో ఆర్థిక సమగ్రత లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు, అభివృద్ధి సంస్థలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఎల్డీఎం సి.హెచ్.వి. ప్రసాద్ పిలుపు నిచ్చారు.

# ఆత్రేయపురంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లు





**ఆత్రేయపురం, పెన్ పవర్: జూన్ 20**: అంతర్జాతీయ యోగా దినోత్సవం (యోగాంధ్ర కార్యక్రమం) విజయవంతం చేసేందుకు ఆత్రేయపురం మండల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన మండలంలోని పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుందని తెలిపారు. విద్యార్థులు, ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమానికి సంబంధించి విద్యార్థుల భాగస్వామ్యం, అవసరమైన ఏర్పాట్లు, నిర్వహణ అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి పి.వి. ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓలు కే. రమేష్ బాబు, పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్, మండల పరిషత్ సిబ్బంది, వివిధ పాఠశాలల పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.